విద్యుత్ సమస్యా.. ఫిర్యాదు చేయండి

మేడ్చల్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని మేడ్చల్ విద్యుత్ శాఖ ఏడీఈ సీహెచ్ రాజమల్లేషం, ఏఈ రాంబాబు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విద్యుత్ కార్యాలయాల వద్ద కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ మేరకు మేడ్చల్ సబ్‌స్టేషన్ వద్ద బ్యానర్ ఏర్పాటు చేశామన్నారు.



స్వామి వారికి అభిషేకం చేస్తున్న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి

రామలింగేశ్వరుడికి
ప్రత్యేక పూజలు

కీసర, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట రామలింగేశ్వర స్వామిని శృంగేరి శారద పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతి దర్శించుకున్నారు. ధర్మ విజయయాత్రలో భాగంగా ఆదివారం కీసరగుట్టకు వచ్చిన ఆయన ముందుగా గర్భాలయంలోని మూలవిరాట్‌కు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయ పునఃనిర్మాణం, అభివృద్ధి పనులకు, తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. ఆలయ దిగువ భాగంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే వేద పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ నారాయణ శర్మ, ఈవో సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలను
తరలించొద్దు

కొడంగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, గురుకులాలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం జేఏసీ నాయకులు దీక్షలో పాల్గొని మాట్లాడారు. కొడంగల్‌కు మంజూరైన విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్‌బాబు, వెంకటయ్య, భీమరాజు, ప్రవీణ్, పీర్ మొహ్మద్, చంద్రయ్య, బాలు, సాయిలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



పక్కాగా
భూముల లెక్క

- సన్నద్ధమవుతున్న భూ కొలతలు, రికార్డుల యంత్రాంగం
- ఎంపిక చేసిన గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే
- సరిహద్దు భూ వివాదాలకు చెక్
- మ్యాపులతో సహా రికార్డుల రూపకల్పనకు చర్యలు

జిల్లాలో 38 గ్రామాల్లో రీ సర్వేకు సన్నాహాలు

భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం భూ సర్వే చేపట్టి పకడ్బందీగా భూముల లెక్క తేల్చేందుకు సన్నద్ధమవుతోంది. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో ఒక్కో జిల్లాలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి భూ సర్వే నిర్వహించింది. ఇక వికారాబాద్ జిల్లాలో 14 మండలాల పరిధిలో 38 గ్రామాల్లో పూర్తి స్థాయిలో భూముల సర్వే నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. సగం ఉండి, సగం లేకుండా, శిథిలమైన మ్యాపులు ఉన్న గ్రామాలతోపాటు మ్యాపులు సరిగాలేని గ్రామాల్లో పూర్తి స్థాయిలో రీ సర్వే నిర్వహించి రైతుల భూ వివరాలతో రికార్డులు రూపొందించనున్నారు.

వికారాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఏ మండలంలో ఏయే గ్రామాల్లో భూ సర్వే నిర్వహిస్తున్నారనే వివరాలతో భూమి కొలతలు, రికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్ ఈనెల 27వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. గెజిట్‌లో నోటిపై చేసిన గ్రామాల్లో ఈ నెలలో భూముల రీ సర్వే ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే భూముల రీ సర్వే ఎవరు, ఏ విధంగా చేపట్టాలనే విషయమై ఇంకా మార్గదర్శకాలు జారీ కాలేదు. రీ సర్వే నిర్వహణ బాధ్యతను ఏదైనా నోడల్ ఏజెన్సీకి అప్పగిస్తారా? లేక ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షణలో సర్వేయర్లు, లైసెన్స్డ్ సర్వేయర్లతో చేపడతారా? అనేది స్పష్టత రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే జిల్లాలో భూముల రీ సర్వే ప్రారంభించనున్నట్లు భూ కొలతలు, సర్వే విభాగం అధికారులు చెబుతున్నారు.

ఏఏ గ్రామాల్లో సర్వే చేస్తారంటే..

రాష్ట్రంలో మొత్తం 413 గ్రామాల్లో భూముల రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించగా, పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాల్లో ప్రారంభించి

మిగతా 8వ పేజీలో...

డ్రోన్ లేదా డీజీపీఎస్‌తో సర్వే

సాధారణంగా భూముల సర్వే డ్రోన్ లేదా డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్) ద్వారా నిర్వహిస్తారు. డ్రోన్ ద్వారా అయితే మొదట డ్రోన్ సర్వేతో గ్రామ మ్యాపును రూపొందిస్తారు. ఆ తర్వాత సర్వే నంబర్ల వారీగా అనుభవ సర్వే నిర్వహించి ప్రస్తుతం ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రకారం హద్దులను నిర్ణయిస్తారు. ఒక్కో సర్వే నంబరులో డిజిటల్ సర్వే నిర్వహిస్తారు. ఆ తర్వాత సర్వే నంబర్లలో రైతుల వారీగా విస్తీర్ణం ప్రకారం హద్దులు నిర్ణయిస్తారు. అక్షాంశాలు, రేఖాంశాల వారీగా జియో కోఆర్డినేట్ చేస్తారు. రైతుల వారీగా పట్టాలను తనిఖీ చేస్తారు. సమగ్ర వివరాలతో పూర్తి స్థాయి జాబితా తయారు చేస్తారు. డీజీపీఎస్ ద్వారా నిర్వహించే భూ సర్వేలో ఖచ్చితత్వం ఎక్కువగా ఉండనుంది. భూ సర్వే నిర్వహించే సమయంలో, సరిహద్దులను నిర్ణయించే సమయంలో భూముల పట్టాదారులకు నోటీసులు జారీ చేయనున్నారు. భూములకు సంబంధించిన పట్టాదారులు, రిజిస్ట్రేషన్‌దారులు వ్యక్తిగతంగా గానీ, తమ ప్రతినిధులు సర్వే జరిగే సమయంలో హాజరు కావాల్సి ఉంటుంది. తమ భూముల సరిహద్దులను గుర్తించడం, లేదా భూములకు సంబంధించిన సమాచారాన్ని సర్వే అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది.



రేడియల్ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

శంషాబాద్ టు లగచర్ల

కొనసాగుతున్న రేడియల్ రోడ్డు సర్వే

కొడంగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ నుంచి నేరుగా కొడంగల్ నియోజకవర్గం లగచర్లకు రోడ్డు మార్గానికి సర్వే కొనసాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్, విద్యాసంస్థలు ఏర్పాటు కానుండటంతో రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. శంషాబాద్ నుంచి పరిగి, దోమ మండలాల మీదుగా రోడ్డు ఏర్పాటుకు సర్వే వేగవంతంగా కొనసాగుతోంది. ఏరియల్ సర్వేతో మార్కింగ్ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు ఏర్పాటులో వంద మీటర్ల వెడల్పు కోసం 1,800 ఎకరాల భూమి అవసరం ఉందని అధికారులు గుర్తించారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి పరిగి నియోజకవర్గంలోని దాదాపు 14 గ్రామాలను కలుపుతూ ఈ రోడ్డు మార్గం ఏర్పాటు కానుందని అధికారులు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే కర్ణాటక సరిహద్దు ప్రాంత ప్రజలు, వికారాబాద్, కొడంగల్, పరిగి, దోమ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. ఇప్పటికే అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ మీదుగా కొడంగల్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రజలు కాస్త ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

హైదరాబాద్‌కు మరో మార్గం.. సాఫీగా ప్రయాణం

హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు ఒకే రోడ్డు ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్ - బీజాపూర్ రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లగచర్ల నుంచి శంషాబాద్‌కు రోడ్డు నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌కు మరో మార్గం అందుబాటులోకి వచ్చి ప్రజలకు ప్రయాణం సులభతరం కానుంది.

ఎక్కడి పనులు అక్కడే..

8

- ఎంపీడీవో ఆఫీసులో కీలక పోస్టులు ఖాళీ
- కార్యదర్శుల ఇష్టారాజ్యం
- ఇబ్బందుల్లో బషీరాబాద్ ప్రజలు



జోరుగా వరి కోతలు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పొలాల్లో హార్వెస్టర్ల సందడి

- 60 శాతానికి పైగా సన్నాలు.. మిగతావి దొడ్డు రకం సాగు
- కలవరపెడుతున్న వరుణుడు
- కల్లాల్లో ధాన్యం.. ఆందోళనలో అన్నదాతలు
- ప్రారంభం కాని కొనుగోళ్లు
- 45 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా



ఘట్‌కేసర్‌లో వరికోత కోస్తున్న హార్వెస్టర్

ఘట్‌కేసర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వానాకాలం వరి కోతలు జోరందుకున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో చెరువులు, బావులు, బోర్ల కింద పెద్దఎత్తున వరి సాగైంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఘట్‌కేసర్ మండలంలోని మూసీ, ఎరిమల్లెవాగు పరివాహక ప్రాంతాల్లో రైతులు ఎక్కువమొత్తంలో వరి సాగు చేశారు. కోతలు షురూ కావడంతో మండల పరిధిలోని ఎదులాబాద్, అవుషాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు పెద్దఎత్తున ధాన్యాన్ని తరలించారు. అయినా ఇప్పటికీ ఇంకా కొనుగోళ్ల ప్రారంభం కాలేదు. ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు

ప్రభుత్వ బోనస్‌తో సన్నాల సాగు

ఈ వానాకాలం సీజన్‌లో మేడ్చల్ పరిధిలో 4,400 ఎకరాల్లో వరి సాగు చేశారు. శామీర్‌పేట్ మండలంలో 2,800 ఎకరాలు, మూడుచింతలపల్లి మండలంలో 3,970 ఎకరాలు, కీసర మండలంలో 2,650 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో 3,200 ఎకరాల్లో వరి సాగు చేశారు. వానాకాలం సీజన్ కావడం,

మిగతా 8వ పేజీలో...

తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలి



వరి కోతలు ప్రారంభమై 20 రోజులు అవుతుంది. అయినా ఇప్పటికీ ధాన్యం కాంటా వేయలేదు. ఎప్పుడు వర్షం పడుతదోనని ఆందోళన చెందుతున్నాం. ఇప్పటికే మొంథా తుపాన్‌తో కల్లాల్లో ఎండబెట్టిన ధాన్యం తడిసింది. నిత్యం ధాన్యం ఆరబోసి టార్పలిన్లు కప్పడమే పని అయ్యింది. త్వరగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి.

- బొక్క శ్రీనివాస్‌రెడ్డి, రైతు, బొక్కోనిగూడ



అక్రమ బదిలీల
కలకలం

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఉన్నతాధికారుల ఆరా

- విజిలెన్స్ విచారణకు ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- సమగ్ర విచారణ జరపకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరిక



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : జిల్లాలో 317 జీవో పేరుతో పెద్దఎత్తున జరిగిన టీచర్ల అక్రమ బదిలీల వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన ప్రత్యేక కథనం కలకలం రేకెత్తించింది. కొన్నాళ్లుగా జిల్లా విద్యాశాఖ ఇష్టారాజ్యంగా చేస్తున్న బదిలీలు, పదోన్నతులతో స్థానిక ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై అన్ని ఆధారాలతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'స్పౌజ్ కోటా.. అందరికీ వాటా' అనే శీర్షికన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై ఉపాధ్యాయవర్గాల్లో ఎక్కడ చూసినా చర్చ జరిగింది. స్పౌజ్ కోటా బదిలీలతో పాటు, డిప్యూటేషన్లు, పదోన్నతుల్లో అక్రమాలపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడ్డాయి. ఈ కథనంపై స్పందించిన ఉపాధ్యాయ సంఘాలు అడ్డగోలుగా జిల్లా విద్యాశాఖ చేస్తున్న బదిలీలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే మరిన్ని ఆధారాలను విచారణాధికారులకు అందచేస్తామని ప్రకటించాయి. ఇదిలా ఉంటే కలకలం రేకెత్తించిన ఈ కథనంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. వివరణ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు ఈ కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు వివరణ ఇచ్చారు.

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే.. : డీఈవో

ప్రభుత్వ ఆదేశానుసారంగా పారదర్శకంగానే బదిలీలు, పదోన్నతులు చేసినట్లు చెప్పారు. అయితే డీఈవో కార్యాలయం నిబంధనలు పాటించి బదిలీలు, పదోన్నతులు ఇచ్చి ఉంటే వీటి ప్రక్రియకు సంబంధించి సమాచారం హక్కుచట్టం కింద ఉపాధ్యాయ సంఘాలు కోరిన సమాచారం ఇప్పటి వరకు ఇవ్వకపోవడానికి కారణాలు ఏమిటీ..? నాగర్ కర్నూల్ నుంచి స్పౌజ్ కోటాలో వచ్చిన ఒక ఉపాధ్యాయురాలి బదిలీ తలకొండపల్లికి కాకుండా నగరంలోని సరూర్‌నగర్‌కు ఎలా బదిలీ చేశారు? బడికెళ్లకున్నా ఆమెకు జీతం ఎలా ఇచ్చారు? డీఈవో కార్యాలయంలో

మిగతా 7వ పేజీలో...



బోటు షికారు..

ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఉల్లాసంగా గడిపారు. ప్రాజెక్టు అలుగు నీటిలో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేశారు.

- ధారూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి)

కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న సందర్శకులు



కార్తీక సందడి

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కీసరగుట్టలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా కార్తీక వన భోజనాలు చేశారు.

- కీసర, నవంబరు 2(ఆంధ్రజ్యోతి)



కీసరగుట్టలో స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కార్తీక వన భోజనాలు చేస్తున్న భక్తులు



సదర్ ఉత్సవంలో ముల్లి పావని, సంఘం నాయకులు

ఘనంగా సదర్ ఉత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్, పోచారం మున్సిపాలిటీ కొర్రెములలో సదర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవంలో ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనియాదవ్ పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఎదులాబాద్‌లో జరిగిన సదర్ కార్యక్రమంలో పావని మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతను చాటుతాయన్నారు. ఎదులాబాద్ ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సదర్‌లో యాదవ సంఘం యువకులు పెద్ద ఎత్తున దున్నపోతులతో సదర్ సయ్యాట నిర్వహించగా అందరినీ ఆకట్టుకుంది. దున్నపోతుల విన్యాసాలను తిలకించడానికి గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అచ్చన శేఖర్, నాయకులు, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను సంరక్షించుకుందాం

మోమిన్‌పేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు అన్నారు. మండలంలోని ఎన్కతల గ్రామ సమీపంలోని మాదిగ గుట్టపై వెలిసిన రుద్రమైసమ్మ ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. అభివృద్ధిలో భాగంగా ఆలయాన్ని తొలగించడం సరైంది కాదన్నారు. పురాతన కాలం నుంచి రుద్రమైసమ్మ అమ్మవారికి రైతులు తమ పొలాల్లో పంటలు పండినప్పుడు మొక్కులు చెల్లించుకునేవారన్నారు. అలాంటి ఆలయాన్ని అభివృద్ధి పనుల పేరుతో తొలగించడం సరైంది కాదన్నారు. ఇందుకు ప్రతీ హిందువు సంతకాల సేకరణ చేపట్టి కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్, ప్రధాన కార్యదర్శి మాధవి, కార్యదర్శి లక్ష్మయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాఘవేందర్, మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.



మైసమ్మ ఆలయాన్ని సందర్శించిన వీహెచ్‌పీ నాయకులు

ప్రజాపాలనలో పేదలకు సొంతిళ్లు

చౌదరిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇల్లు లేని పేదలకు సొంతింటి కల సాకారం అవుతోందని మాజీ సర్పంచ్ లక్ష్మిసుధనర్సింహులు అన్నారు. ఆదివారం పద్మారంలో అర్హులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్లాబ్ పనులను ఆమె ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. గత ప్రభుత్వం కొందరికి, కొన్నిచోట్ల మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించిందని. అయితే కాంగ్రెస్ పాలనతో స్థలం ఉన్న పేదలందరికీ ఇంటిని నిర్మించి ఇస్తోందని చెప్పారు. ఇల్లు మంజూరైన వారంతా వెంటనే నిర్మాణాలను ప్రారంభించుకోవాలని, ఎంత త్వరగా పనులు చేపడితే అంత తొందరగా బిల్లు వస్తుందని మాజీ సర్పంచ్ సూచించారు. తమ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, వెంకటేశ్, యాదయ్య, కృష్ణయ్య, బాబయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఇంటి స్లాబు పనులకు పూజచేస్తున్న లక్ష్మీసుధ



నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు

● పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి గత ప్రభుత్వం గ్రామాల్లో సేంద్రియఎరువుల తయారీకి నిర్మించిన కంపోస్ట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. పారిశుధ్య నిర్వహణతో పాటు సేంద్రియ ఎరువును సమకూర్చాలని ఒక్కో పంచాయతీకి కంపోస్టు షెడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో షెడ్డుకురూ.2లక్షల40వేలు మంజూరు చేసింది. అయితే గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. మరి కొన్ని గ్రామాల్లో షెడ్డులోని గదుల్లో తడి, పొడి చెత్తను వేసి అలాగే వదిలేశారు. దీంతో షెడ్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతోంది.

అవగాహన లోపం

గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన లేకపోవడంతోనే కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. అప్పట్లో వీరికి శిక్షణ ఇచ్చినప్పటికీ వర్మీ కంపోస్టు తయారీ పద్ధతి తెలియకపోవడం, పంచాయతీల్లో సరిపడే సిబ్బంది, గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేకపోవడంతోనే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను అక్కడికి చేర్చి గాజు, ఇనుము, ప్లాస్టిక్ లాంటి తదితర పొడి చెత్త వ్యర్థాలను వేరుచేసి గదుల్లో భద్రపర్చాలి. తడి చెత్తను కుండీల్లో వేసి సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలి. వీటి నిర్వహణ బాధ్యత సర్పంచులు చూసుకోవాలి. అయితే మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో ఇవేమీ అమలు కావడంలేదు.



దేవరఫస్లాబాద్‌లో వినియోగంలో లేని కంపోస్ట్ షెడ్డు

నిర్వహణలో అలసత్వం

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కంపోస్టు షెడ్ల నిర్మాణంతో ప్రజలకు, ప్రభుత్వానికి ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. వీటి నిర్మాణంలో చూపిన శ్రద్ధ నిర్వహణలో చూపకపోవడంతో ఎరువుల తయారీకి అవకాశం ఉన్నా అందిపుచ్చుకోలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారిస్తారేమోననే ఆశలు చిగురిస్తున్నాయి. అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎరువుల తయారీకి నోచుకోక మూలనపడ్డాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీల పాలన గడువు ముగియడం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు నోటిఫికేషన్ విడుదలైనా కోర్టు తీర్పు కారణంగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. గ్రామ పంచాయతీల నిర్వాహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టలేక సతమతం అవుతున్న నేపథ్యంలో షెడ్ల నిర్వహణకు నిధులు ఇచ్చేదెవరు, వాటి నిర్వాహణను పట్టించుకునేదెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో ఇప్పుడు వీటి నిర్వాహణపై సందిగ్ధం నెలకొంది. స్థానిక సంస్థల గడువు గడిచినప్పటి నుంచి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి.

ఎరువు తయారీకి చర్యలు తీసుకుంటాం



దౌల్తాబాద్ మండలంలో నిరుపయోగంగా మారిన కంపోస్టు షెడ్లను అందుబాటులోకి తెచ్చి సేంద్రీయ ఎరువు తయారీకి చర్యలు తీసుకుంటాం, ఇప్పటికే సేంద్రియ ఎరువు తయారీపై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశాం.

- శ్రీనివాస్, దౌల్తాబాద్ ఎంపీడీవో

డీసీసీ పీఠంపై ఎమ్మెల్యేకు సీఎం ఆఫర్!

● ఆసక్తి చూపని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నుంచి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఆఫర్ వచ్చింది. అయితే సీఎం సొంత జిల్లా కావడంతో ఈ పదవిని ఎమ్మెల్యేలకే కట్టబెడితే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీలో చర్చకు దారితీసింది. ఇంతకుముందు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం వికారాబాద్ నుంచి రెడ్డి సామాజికక వర్గానికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు పోటీ పడుతున్నారు. తాండూరుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు ఉత్తంచంద్ బీసీ సామాజిక వర్గం నుంచి తనకు వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా ఉత్తంచంద్ పేరును అధిష్టానానికి సూచించారు. అయితే పార్టీ అధ్యక్ష పదవి స్వీకరించేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆసక్తి చూపడం లేదు. జిల్లా అధ్యక్ష పదవి స్వీకరిస్తే అధిక సమయం తాండూరుకు కేటాయించలేకపోతామన్న భావనతో మనోహర్‌రెడ్డి ఉన్నారు. ఇప్పటికే మధ్యవర్తి ద్వారా సీఎంకు తెలియజేసినట్లు సమాచారం. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని స్వీకరించే వారు పార్టీలో కనీసం ఐదేళ్ల సభ్యత్వ సీనియారిటీ ఉండాలని నిబంధన ఉంది. శాసన సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి బీఫామ్ దక్కించుకొని ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. ఎమ్మెల్యేలకు ఐదేళ్ల సీనియారిటీ నిబంధన సడలింపు ఉండే అవకాశం కూడా ఉంది. రంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవి రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే వికారాబాద్ జిల్లా అధ్యక్ష పదవి బీసీ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉంది. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన హరివర్ధన్‌రెడ్డి కొనసాగుతున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల తర్వాత కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని అధిష్టానం ప్రకటించనుంది. ఇప్పటికే జిల్లాలో పలువురి అభిప్రాయలను సేకరించిన పార్టీ పరిశీలకులు ఢిల్లీ అధిష్టానం ముందు ఉంచారు.

మాలల రణభేరిని విజయవంతం చేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

కొందుర్గు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాలల రణభేరి సభను విజయవంతం చేయాలని రంగారెడ్డిజిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మహేశ్ అన్నారు. ఆదివారం కొందుర్గులో మాల మహానాడు కరపత్రికను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... మాలలు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ ఉప వర్గీకరణను ప్రభుత్వాలు వీడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ పాయింట్లను సవరించాలన్నారు. నవంబరు 23న జరిగే మాలల రణభేరి సభకు ప్రతి ఒక్కరూ తరలొచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెన్నయ్య, నర్సింహ, వినోద్, శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో సుదర్శనహోమం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు


లోక కల్యాణం కోసమే సుదర్శన హోమం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురిసి పడిపంటలు బాగాపండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి ఆలయ ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీమన్నారు రంగనాయకస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శనహోమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపించారు. అమ్మవారికి ఓడిబియ్యం గాజులు, పూలు, పండ్లు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారిని ప్రతిష్ఠించి సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. లోక కల్యాణం కోసమే ఆలయంలో నెలలో మొదటి ఆదివారం సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తిరువదండం పోరెత్తి వంశస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.65 లక్షలు ఇవ్వాలి

● ఎమ్మెల్యేకు విన్నవించిన మొండిగౌరెల్లి రైతులు

యాచారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎకరం భూమికి రూ.65లక్షల పరిహారం ఇవ్వాలని మొండిగౌరెల్లి రైతులు ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విన్నవించారు. భూములు పోతే తామంతా వీధిన పడతామని ఎమ్మెల్యేతో వాపోయారు. మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇచ్చి తమకు ఉపాధి చూపాలని రైతులు కోరారు. అయితే అసైన్డ్ భూముల పేరిట పరిహారం కోసం కొందరు బినామీలు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారికి పరిహారం ఇవ్వకుండా నిజమైన రైతులు, పొజిషన్‌లో ఉన్న వారికే పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. వారి సమస్యలను సావధానంగా విన్న మల్‌రెడ్డి నిర్వాసిత రైతులకు మేలు చేస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నదానికంటే మెరుగైన పరిహారం ఇచ్చేలా ప్రభుత్వానికి రైతుల డిమాండ్లపై విన్నవిస్తానని చెప్పారు. పరిహారం విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని చెప్పారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డితో ఫోన్లో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చూడాలని రంగారెడ్డి సూచించారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి సమస్యలు వివరిస్తున్న రైతులు


సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల స్వామి

సమాజ నిర్మాణంలో బీసీ రిజర్వేషన్లు కీలకం

షాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో బీసీ రిజర్వేషన్లు అనేవి కీలకం అని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్షలు ఆదివారంతో 22వ రోజుకు చేరాయి. దీక్షలో తమ్మలి సంఘం నాయకులు రవీందర్, రమేష్, నరేందర్, అశోక్, అనంతయ్య, రాము, రవి, గౌతం, పద్మనాభం, శ్రీనివాస్, అనిల్ పాల్గొని బీసీ సంఘం చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ శాతాన్ని కొందరు కుట్రతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రాజేందర్‌గౌడ్, నర్సింహులు, రాము, మాజిద్, రాజు, చంద్రయ్య, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

కొండకల్‌లో దేవతామూర్తుల ప్రతిష్ఠాపన


కుంకుమార్చనలో మహిళలు

శంకర్‌పల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకల్ గ్రామంలో నిర్మించిన మల్లన్న, బీరప్ప, కొండపోచమ్మ ఆలయాల్లో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దేవతమూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ గాయకుడు సతీష్ పంతులు ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు, నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కురుమ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిపల్లిలో ఘనంగా పడిపూజ


పడిపూజలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్: నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేతిరెడ్డిపల్లిలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని ఆదివారం గనంగా జరిగింది. అంకర మోని శ్రీనివాస్‌స్వామి కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పడిపూజ, సత్యనారాయణస్వామి వ్రతం ఏర్పాటు చేశారు. శ్రీశైలం గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. సన్నిధాన స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల గదుల ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రవాస భారతీయుడు

తలకొండపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):తలకొండపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో దివంగత కొత్త నర్సింహులు, ఈశ్వరమ్మ, కొత్త రామలింగయ్య, కమలమ్మల జ్ఞాపకార్థం రూ.15లక్షలతో వారి కుటుంబ సభ్యులు అదనపు గదులను నిర్మించారు. ఈ పాఠశాలలో చదువుకున్న ఎన్నారైలు వాణిరామకృష్ణ, శివకుమార్, రాఘవేందర్‌లు నిర్మించిన అదనపు గదులను ఆదివారం ప్రారంభించారు. పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పెరుమాండ్ల లలితమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్మాణ దాతలు, వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తాము ఇదే పాఠశాలలో చదివి అమెరికాలో స్థిరపడ్డామని గుర్తు చేశారు. తాము చదివిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే అదనపు క్లాస్ రూంలు నిర్మించామని తెలిపారు. పాఠశాలలోని వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని గొప్పస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీలక్ష్మి, నాయకులు మొహన్‌రెడ్డి, జ్యోతి, సురేశ్, టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

కొడంగల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం పురోహితులతో కలిసి ఆలయ ధర్మకర్తలు మిడిదొడ్డి నందారం శ్రీనివాసగుప్తా దంపతులు, తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మాఢ వీధులు, తదితర పనులకు భూమి పూజ చేశారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తదితరులు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారిలో కొంతమంది రెండు రోజులుగా కలెక్టర్ చేతుల మీదుగా పరిహారం చెక్కులు అందుకుంటున్నారు. మిగతావారు సైతం ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆలయ ధర్మకర్తలు కోరారు. ఈ సందర్భంగా స్వామివారిని మాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మురారి వశిష్ఠ, నందారం రత్నం, పురోహితులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీల కలకలం

(ఐదో పేజీ తరువాయి)

పనిచేసినట్లు ఆన్‌డ్యూటీ సర్టిఫికెట్ డీఈవో సంతకం లేకుండా ఎలా ఇచ్చారు? ఆ తరువాత మళ్లీ డీఈవో ద్వారా ఎలిజిబుల్ ఎలా మంజూరు చేశారు? అలాగే నల్గొండ, ఇతర జిల్లాల నుంచి బదిలీ, డిప్యూటేషన్లపై వచ్చిన వారిని ఏ నిబంధనల ప్రకారం ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు? అనే విషయాలు తేలాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే నిర్ణయాలు : డీఈవో సుశీంద్రరావు

జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలలో జరుగుతున్న అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై డీఈవో సుశీంద్రరావు స్పందించారు. జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల మొత్తం ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన 317 ప్రకారమే బదిలీలు చేశామని, ఆప్షన్ల ప్రక్రియ నుంచి పోస్టింగ్ ఆర్డర్‌లను జారీ చేయడం వరకు ప్రతీది పారదర్శకంగా అభ్యర్థుల సమక్షంలో నిర్వహించినట్లు చెప్పారు. కొంతమంది ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారనే దానిలో వాస్తవం లేదన్నారు. ఇలాంటి ప్రచారం వల్ల ఉపాధ్యాయ వర్గంలో తప్పుడు అభిప్రాయం కలుగుతుందని, అన్ని బదిలీలు, పదోన్నతులు కమిషనర్ మరియు పాఠశాల విద్యా డైరెక్టర్ స్పష్టమైన సూచనల మేరకే చేసినట్లు తెలిపారు. బదిలీలను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా యంత్రాంగం ప్రతి స్థాయిలోనూ పర్యవేక్షించిందన్నారు. జీవిత భాగస్వామి పనిచేసే మండలంలో ఖాళీలు అందుబాటులో లేని సందర్భాల్లో, ఉపాధ్యాయుడి సౌలభ్యం, విద్యార్థుల విద్యా ప్రయోజనాలను కాపాడటానికి పక్కనే ఉన్న మండలాలకు బదిలీలు చేసినట్లు సమర్థించుకున్నారు. పాఠశాల సహాయకుడు, ప్రధానోపాధ్యాయుడు, ఇతర కేటగిరీలకు పదోన్నతులు సీనియారిటీ జాబితాలకు అనుగుణంగా, పారదర్శకంగా చేసినట్లు తెలిపారు.

ఉన్నత స్థాయి విచారణ జరపాలి : టీఎస్‌యూటీఎఫ్

డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి.. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. స్పౌజ్ కోటాలో జరిగిన బదిలీలు, ఇతర పదోన్నతుల విషయంలో జిల్లా విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి బయట జిల్లాల నుంచి అనేక మందిని దొడ్డిదారిన ఇక్కడకు తీసుకువచ్చి పోస్టింగ్‌లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఈ విషయం ఉపాధ్యాయ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఈ వ్యవహారాలను చూస్తే విద్యాశాఖపై ఉన్న నమ్మకం పోయిందన్నారు. పారదర్శకతను పాతరేసి ఫైరవీలకు డీఈవో కార్యాలయం పెద్దపీట వేసినట్లు స్పష్టమైందన్నారు. వీటిని బట్టి తాము ఏమైనా చేయగలమనే సంకేతాలను జిల్లా విద్యాశాఖ చెప్పకనే చెప్పిందన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని విద్యావ్యవస్థలో క్రమశిక్షణ, న్యాయపరమైన పరిపాలన పునరుద్ధించాలంటే ఈ అక్రమాలపై శాఖ పరమైన ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేదంటే వీటిపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టీఎస్‌యూటీఎఫ్ నేతలు హెచ్చరించారు. అక్రమ బదిలీలు, డిప్యూటేషన్ల వ్యవహారం జిల్లా స్థానిక ఉపాధ్యాయులను తీవ్ర క్షోభకు గురిచేస్తుందని, అనేక మంది టీచర్లు సీనియారిటీ కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని, వీటిపై విచారణ జరపాలని టీఎస్‌టీయూఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్స్ చీఫ్ ఎడిటర్ మాణిక్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అక్రమాల వ్యవహారం సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

విజిలెన్స్ విచారణ జరపాలి

- ఆంధ్రజ్యోతి కథనం అక్షరసత్యం
- సేవ్ టీచర్స్ సంఘం

విద్యాశాఖలో అక్రమ బదిలీలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం అక్షర సత్యమని, ఈ అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరపాలని సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బొడ్డు రవి, ప్రధాన కార్యదర్శి తలారి సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 317 ప్రకారం స్పౌజ్ కోటాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చినందుకు 'ఆంధ్రజ్యోతి' పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఉపాధ్యాయులు, స్థానిక నిరుద్యోగ యువతకు అన్యాయం చేసే విధంగా అక్రమాలకు పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోకుంటే తాము ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వం దీనిపై విచారణ చేపడితే అక్రమాలకు సంబంధించి మరిన్ని ఆధారాలను తాము ఉన్నతాధికారులకు అందించేందుకు సిద్ధమన్నారు. వందలాది మంది స్థానిక టీచర్లకు అన్యాయం చేసిన వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆగిన పనులు.. తప్పని వెతలు

- అసంపూర్తిగా కడ్తాలలో మండల పరిషత్ భవన నిర్మాణం
- నిధులు కేటాయించినా రెండేళ్లుగా ముందుకు సాగని పనులు
- తొమ్మిదేళ్లుగా అద్దె భవనంలో కార్యాలయ నిర్వహణ
- ప్రజలకు, అధికారులకు తప్పని ఇబ్బందులు


అసౌకర్యాల అద్దె భవనంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం


అసంపూర్తిగా మండల పరిషత్ కార్యాలయ భవనం

కడ్తాల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనుల విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల ఉదాసీనత విమర్శలకు తావిస్తుంది. అసంపూర్తి పనులతో భవన నిర్మాణం పూర్తి కాక ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతుంది. దీంతో ఏళ్ల కాలంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

తొమ్మిదేళ్లుగా తప్పని బాధలు

కడ్తాల మండల పరిషత్ కార్యాలయం అసౌకర్యాల అద్దె భవనంలో కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్ 11న పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటులో భాగంగా కడ్తాలను మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. కాగా మండలానికి ప్రధాన పాలనా కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయానికి తొమ్మిదేళ్లయినా నేటికీ సొంత భవనం లేదు. సొంత భవనం లేని కారణంగా ఏళ్ల కాలంగా జాతీయ రహదారి పక్కన ఓ ప్రైవేట్ భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. కార్యాలయాలనికి అనుగుణంగా లేని భవనంతో ఇటు అధికారులు, పనుల మీద వస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో సమావేశాల నిర్వాహణకు అనువైన హాలు లేక రేకుల షెడ్డులో మండల పరిషత్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న కడ్తాలలో మండల పరిషత్‌కు సొంత భవనం నిర్మించాలని స్థానికులు, నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గల వెంచర్‌లో గ్రామ పంచాయతీ పది శాతం భూమిలో మండల పరిషత్ సొంత భవనం నిర్మాణానికి స్థలం కేటాయించారు.

ఎస్‌డీఎఫ్ కింద రూ.50 లక్షలు మంజూరు

కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ.50 లక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో 2023 సెప్టెంబర్ 8న భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిధులున్నంత వరకు పనులు చేపట్టాడు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ నిర్మాణంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అదనపు నిధులు మంజూరు కాకపోవడం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడం, ఆపై ఎన్నికలు రావడంతో భవన నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది.

ఎంపీ ల్యాడ్స్ మంజూరు

కడ్తాల మండల పరిషత్ అసంపూర్తి భవన నిర్మాణ పనులకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించారు. నిధుల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యి నెలలు గడుస్తున్నా నేటికీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. పనులు ప్రారంభించడం లేదు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి ఈ విషయంలో చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రూ.కోటి నిధులు అవసరం

మండల పరిషత్ కార్యాలయ అసంపూర్తి పనులకు మరో రూ.కోటి అవసరముందని అధికారులు పేర్కొంటున్నారు. జీ ప్లస్ వన్ భవన నిర్మాణానికి ప్రతిపాదించగా, దీనికి చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. అదనపు నిధుల మంజూరు గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అదనపు నిధులు మంజూరు చేయాలి



అసంపూర్తిగా ఉన్న కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి. నిధుల మంజూరు విషయంలో స్థానిక ఎమ్మెల్యే ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలి. మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనం లేక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- దోనాదుల మహేశ్, కడ్తాల్

రెండు వారాల్లో పనులు ప్రారంభం



కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనుల పూర్తికి చర్యలు చేపట్టాం. ఎంపీ డాక్టర్ మల్లు రవి నిధుల నుంచి రూ.50 లక్షలు అసంపూర్తి పనులకు కేటాయించడం జరిగింది. టెండర్ల ప్రక్రియ సైతం చేపట్టాం. మరో రెండు వారాల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

-దార్ల పరమేశ్, ఏఈ,కడ్తాల్

భవన నిర్మాణం త్వరలో పూర్తి ...



అసంపూర్తిగా ఉన్న మండల పరిషత్ భవననిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. అదనపు నిధుల గురించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయాం. ఎంపీ మల్లు రవి నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. టెండర్లు పూర్తికాగానే పనులు చేపడుతాం.

- గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ, కడ్తాల్

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఆమనగల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఏడీఈ సీహెచ్.బాలకృష్ణ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల సదస్సు కొనసాగుతుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల విద్యుత్ వినియోగదారులు సదస్సుకు హాజరై విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయం, ఓల్టేజి హెచ్చుతగ్గు సమస్యలు, సరఫరాలో ఉత్పన్నం అవుతున్న ఇతర సమస్యలు, విద్యుత్ మీటర్ సమస్యలు, కొత్త సర్వీస్‌ల మంజూరు, బిల్లులో లోపాలు తదితర సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు హాజరై సభను విజయవంతం చేయాలని ఏఈలు శంకర్‌నాయక్, నరేందర్ కోరారు.


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఘనంగా బీరప్ప బోనాలు

తాండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలోని బీరప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఆదివారం దేవాలయ కమిటీ, కురుమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల వాయిద్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్మాణానికి సహకరించిన కురుమ సంఘం ప్రతినిధులను ఈ సందర్భంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు పూజారి పాండు, న్యాయవాది గోపాల్, మహిపాల్, హన్మయ్య, నాగారం జగదీశ్వర్ పాల్గొన్నారు.

మరమ్మతులు చేసిన ఐదారు రోజులకే...

- కూరుకుపోయిన మ్యాన్‌హోల్
- పనుల్లో నాణ్యత లోపం వల్లే ఇబ్బందులు
- ఇప్పటికైనా మెరుగ్గా చేయాలంటున్న ప్రజలు


బస్టాండులో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

శంషాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ బస్టాండులో మ్యాన్‌హోల్ ఆదివారం మళ్లీ కూరుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకులకు అడ్డకులు ఏర్పడుతున్నాయి. వారం రోజుల క్రింతం తెరుచుకున్న మ్యాన్‌హోల్‌పై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో ఆర్టీసీ సిబ్బంది స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. అయితే పనుల్లో నాణ్యత లోపించడంతో కొన్ని రోజులకే మ్యాన్‌హోల్ మరలా కూరుకుపోయింది. దీంతో ఆదివారం మరోసారి మరమ్మతులు చేపట్టారు. ఈ సారైనా నాణ్యతగా పనులు చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు, పట్టణవాసులు కోరుతున్నారు.


లక్ష్మీవేంకటేశ్వ రాలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

లక్ష్మీవేంకటేశ్వరాలయంలో సత్యనారాయణ వ్రతాలు

చేవెళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని చేవెళ్ల పరిధి అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం చేవెళ్లలో గల లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు, పూజారి కన్న, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన


అన్నోజిగూడలో కురుస్తున్న వర్షం

ఘట్‌కేసర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్, పోచారం, మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 7.20 గంటల నుంచి 7.50గంటల వరకు దంచికొట్టిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, ఘనాపూర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, పోచారం, సంస్కృతి టౌన్‌షిప్, జోడిమెట్ల, నారపల్లి, యంనంపేట్, ఇస్మాయిల్‌కాన్‌గూడ, చౌదరిగూడలలో వర్షం తీవ్రత అధికంగా ఉంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షంతోపాటు ఈదురుగాలి వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరికోతలు జోరందుకుంటున్న తరుణంలో తరచూ వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సదర్ కదర్‌ను పెంచాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


దున్నలతో ఎమ్మెల్యే శంకర్, యాదవ మహాసభ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యాదవులు నిర్వహించే సదర్ ఉత్సవం కదర్‌ను పెంచాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. దున్నల విన్యాసాలను తిలకించారు. పార్టీలకు అతీతంగా అందరూ సదర్‌లో పాల్గొనాలని కోరారు. అలాగే కేశంపేట చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ నిర్వహించగా, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవియాదవ్, స్థానిక నాయకులు వై.యాదయ్య యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, షాబాద్ మల్లేష్‌యాదవ్, నడికూడ రఘునాథ్, బాల్‌రాజ్, యాదగిరి, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నవగ్రహాల ప్రతిష్ఠాపన


నవగ్రహాల ఊరేగింపులో గ్రామస్థులు

దుద్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామంలో పెరుమాళ్ల ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా సోమవారం నవగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నవగ్రహాలను గ్రామ పుర వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

7న శబరిమల పాదయాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న గురుస్వామి

తాండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈనెల 7వ తేదీన తాండూరు నియోజకవర్గం నుంచి 70 మంది అయ్యప్పస్వామి భక్తులు 38రోజుల పాటు 1350 కి.మీ పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. ఈనెల 16 నుంచి డిసెంబర్ 27 వరకు ఆలయంలో నిత్య అన్నదానం నిర్వహించనున్నారు. గణపతి హోమం అనంతరం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అయ్యప్ప భక్తులు నిర్ణయించారు.

ఎక్కడి పనులు అక్కడే..

- ఎంపీడీవో ఆఫీసులో కీలక పోస్టులు ఖాళీ
- కార్యదర్శుల ఇష్టారాజ్యం
- ఇబ్బందుల్లో మండల ప్రజలు



బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయం


ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు(ఫైల్)

బషీరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల మండలం బషీరాబాద్‌లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. మండల పరిషత్ కార్యాలయాన్ని నడిపే పెద్ద దిక్కులేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కీలక పోస్టులకు అధికారులు లేకపోవడంతో పనులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. కొన్ని రోజులుగా కార్యాలయానికి వస్తే ఎంపీడీవో, ఎంపీవో, సూపరింటెండెంట్ కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో సకాలంలో పనులు జరగక నిత్యం కార్యాలయం చుట్టూ తిరగాల్సివస్తోందని వాపోతున్నారు.

బాధ్యతలు నిర్వర్తించేదెవరు?

ఎంపీడీవో కార్యాలయంలో కీలక పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. ఎంపీవో, సూపరింటెండెంట్, తదితర సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే వారు కొంతకాలం తర్వాత ఏదో కారణంతో సెలవు పెట్టి వెళ్లడంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తిరుమలస్వామి, ఎంపీవోగా విజయ్‌కుమార్, సూపరిటెండెంట్‌గా విజయకుమారి, సీనియర్ జూనియర్ అసిస్టెంటుగా శేర్‌ఖాన్, చెన్నయ్య, వంశీ తదితరులు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా నెలకిందట స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వచ్చిన సమయంలో ఎంపీడీవో తనవల్ల డ్యూటీ చేయడం కావడంలేదని కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులను కలిసి దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లారు. ఈక్రమంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీవో విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఎమైందో ఏమో కానీ ఎంపీవో కూడా ఇటీవల ఫారన్ సర్వీస్‌పై తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపార్టుమెంట్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు ఇక్కడి సూపరిటెండెంట్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు ఇచ్చారు. సదరు అధికారిణి తప్పని పరిస్థితిలో ఎంపీడీవోగా చార్జి తీసుకుని, మరుసాటి రోజు మెడికల్ లీవ్‌పై వెళ్లిపోయారు. ఇలా అయితే బాధ్యతలు నిర్వర్తించేది ఎవరు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇళ్లు, గృహ నిర్మాణ, ఉపాధిహామీ, గ్రామ పంచాయతీలు, మండలాభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఎంపీడీవో పాత్ర కీలకం కావడంతో ఎక్కడికక్కడా పనులు స్తంభించిపోయాయి. ప్రజలు కూడా వివిధ పనుల కోసం కార్యాలయానికి తిరగడం నిత్యకృత్యమైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కీలక పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మండలంలో 39గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలు, గిరిజన తండాలున్నాయి. గత కొన్ని రోజులుగా సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో కార్యదర్శులు కొందరు అడిందే ఆట పాడిందే పాట అన్నచందంగా పరిస్థితి తయారైంది. దీంతో పల్లెల్లో సమస్యలు తిష్టవేశాయి. మురుగుకాల్వల నిర్వహణ, తాగునీరు, ఇతరేత్ర సమస్యలను విన్నవించినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. ఉదయన్నే వచ్చి, మధ్యాహ్నానికే పత్తా లేకుండాపోతున్నారనే ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఓపక్క నిధులు రాక, పల్లెల్లో పనులు జరుగక సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

ఇంటి సమస్యపై వారం రోజులుగా తిరుగుతున్నా



నా భార్య పేరిట ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. మంజూరు పత్రంలో పేరులో తప్పుదొర్లడంతో ఇంటి నిర్మాణానికి ముగ్గు వేయడంలేదు. గ్రామ కార్యదర్శిని అడిగితే ఎంపీడీవోను కలిసి లాగిన్‌లో తప్పును సరిచేయించుకోవాలని చెబుతున్నారు. కార్యాలయానికి వెళితే ఎంపీడీవో లేరని తెలిసింది. వారం, పది రోజులుగా తిరగుతున్నాను. సమస్య ఎవరికి చెప్పుకోవాలో, ఎవరు పరిష్కారిస్తారో తెలియడంలేదు.

- పి.అయిల్‌రెడ్డి, పర్వత్‌పల్లి, బషీరాబాద్ మండలం

క్రైం కార్నర్

బైకును ఢీకొట్టిన ట్రాక్టర్.. వ్యక్తి మృతి

● తాండూరు-లక్ష్మీనారాయణపూర్ మార్గమధ్యలో ఘటన

యాలాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బైకును ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన యాలాల మండల పరిధిలోని తాండూరు-లక్ష్మీనారాయణపూర్ మార్గమధ్యలో చోటుచేసుకుంది. యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పంజాబ్‌కు చెందిన జగదీప్‌సింగ్(31) అనే వ్యక్తి బొంరాస్‌పేట్ మండలం కొత్తూరులో ఉంటూ హార్వెస్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అయితే జగదీప్‌సింగ్ శనివారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో తన బైక్‌పై తాండూరు నుంచి లక్ష్మీనారాయణపూర్ వైపు వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా నడుపుతూ కాగ్నా నది బ్రిడ్జిపైకి రాగానే బైకును ఢీ కొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న జగదీప్‌సింగ్ కింద పడి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు రామ్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


మోహన్‌రెడ్డి (ఫైల్)

మర్పల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోవాకు వెళ్తున్నానని చెప్పి వ్యవసాయ పొలంలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మర్పల్లి మండలంలోని కొత్లాపూరం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మర్పల్లి మండలంలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన చామల మోహన్‌రెడ్డి(30) గత మంగళవారం తన కుటుంబసభ్యులతో గోవాకు వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఈక్రమంలో శనివారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో రేకులషెడ్డులో నుంచి దుర్గంధం రావడంతో గమనించిన స్థానికులు పొలం యజమానికి సమాచారం అందించారు. అక్కడికి వెళ్లి చూసిన యజమాని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, రేకులషెడ్డు పక్కనే మోహన్‌రెడ్డి బైక్ కనిపించడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని మృతుడు మోహన్‌రెడ్డిగా గుర్తించారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మోహన్‌రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రైలుకింద పడి.. కుడికాలు కోల్పోయి..

● పండ్లు విక్రయించేందుకు వెళ్లి వస్తుండగా ఘటన

బషీరాబాద్, నవంబరు 2(ఆంధజ్యోతి): ఊరురా తిరిగి పండ్లు అమ్ముకునే చిరువ్యాపారి ఆగి ఉన్న రైలు దాటుతుండగా ముందుకు కదలడంతో కుడి కాలును కోల్పోయాడు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రం సేడం రైల్వేస్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపినా వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలం వాల్యానాయక్‌తండాకు చెందిన రాజురథోడ్(28) పొట్టకూటి కోసం తాండూరు నుంచి పళ్లను తీసుకెళ్లి పలు ప్రాంతాల్లో తిరుగుతూ విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో కర్ణాటకలోని సేడంకు ఉదయం రైలులో వెళ్లాడు. పండ్లను విక్రయించి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి రైలులో వచ్చేందుకు సేడం స్టేషన్‌కు బయల్దేరాడు. ప్యాసింజర్ రైలు ఆగే ప్లాట్‌పామ్ దిక్కు రావడానికి ఆగి ఉన్న గూడ్స్ రైలు కిందనుంచి వెళ్లాడు. అంతలోనే ఆగి ఉన్న గూడ్స్ రైలు కదలడంతో ప్రమాదవశాత్తు రైలు చక్రాల కింద పడి కుడికాలు తెగిపడి విలవిల్లాడిపోయాడు. గమనించిన అక్కడి రైల్వే సిబ్బంది వెంటనే గుల్బర్గాలోని ఓ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. రైల్వేపోలీసులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

క్రాకర్స్ నిల్వచేసిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా క్రాకర్స్ నిల్వచేసిన వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన ఎడవెల్లి రమేష్(39) అనుమతి లేకుండా క్రాకర్స్ నిల్వచేసి విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం అతడి ఇంటిపై దాడి చేశారు. పలురకాల క్రాకర్స్ అధిక మొత్తంలో పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకొని రమేష్‌పై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా క్రాకర్స్ దుకాణం ఏర్పాటు చేసినా పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వచేసినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



పోలీసులు సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లు

యాలాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంటుపల్లి, దేవనూరు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జుంటుపల్లి వద్ద ఆదివారం మధ్యాహ్నం దేవనూరు గ్రామ సమీపంలో ఒక ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

సిమెంట్ ట్యాంకర్ బీభత్సం


వాహనాన్ని ఢీకొట్టిన సిమెంట్ ట్యాంకర్

పరిగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పరిగిలో సిమెంట్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. కొడంగల్ వైపు నుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ హైదరాబాద్ వెళుతున్న క్రమంలో పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొట్టింది. రోడ్డు పక్కన ఓ వాహనం తీవ్రంగా దెబ్బతిన్నది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వాహనాలను ఢీకొట్టిన ట్యాంకర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

జోరుగా వరి కోతలు

(ఐదో పేజీ తరువాయి)


ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బొక్కోనిగూడ కళ్లంలో ఆరబోసిన ధాన్యం


ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుతున్న యంత్రం

ప్రభుత్వ బోనస్ క్వింటా వడ్లకు రూ.500 ఉండడంతో 60 శాతానికి పైగా సన్న రకం వరి సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో దాదాపు 42వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వర్షాలతో అన్నదాత ఆగమాగం

వరి కోతల సమయంలో వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వర్షం వస్తే ధాన్యం రాలిపోతుందని, కోతలు సాగవని గుబులు పడుతున్నాడు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడం, చెరువులు, కుంటలు నిడుకండల్లా ఉండడం, భూగర్భ జలాలు సైతం పుష్కలంగా ఉండడంతో పొలాల్లో నీరు ఊరుతున్నది. దీంతో సాధారణ హార్వెస్టర్లతో కోతలు సాధ్యం కాదు. బురదలో కోయడానికి బెల్టుయంత్రాలు పని చేస్తాయి. వీటికి ఎక్కువ చార్జి వసూలు చేస్తారు. సాధారణంగా పొలం గట్టిగా ఉండి దిగబడకపోతే గంటకు రూ.2,200 చార్జి వసూలు చేస్తారు. ఆదే బురదలో కోసే యంత్రాలకు గంటకు రూ.3,000 నుంచి రూ.3,500 వరకు తీసుకుంటారని రైతులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలును సహకార సంఘం చేపట్టింది. కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వరి గడ్డికి డిమాండ్ ఉన్నా..

వానాకాలం వరి కోతల్లో గడ్డి పనికి రాకుండా పోతోంది. బోర్ల కింద సాగు చేసిన పొలాలు పూర్తిగా ఎండి ఉంటే తప్ప, నీళ్ల పారే పొలాల్లో బురదలో కోసే యంత్రాలతో గడ్డి పూర్తిగా నీటిలోనే కలిసిపోతోంది. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గడ్డికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఒక్క మోపు రూ.100 నుంచి రూ.120 వరకు పలుకుతోంది. వర్షాకాలంలో గడ్డి ఏమాత్రం పనికిరాకుండా పొలంలోనే కలిసిపోతుందని, దీంతో ఆర్థికంగా నష్టపోతామని రైతులు చెబుతున్నారు.

కొనుగోళ్లు ప్రారంభించాలి



వరి కోతలు ప్రారంభమైనా కొనుగోళ్ల కొనుగోళ్ల ఇంకా షురూ కాలేదు. ఎక్కడ చూసినా కళ్లాల్లో ధాన్యం రాసులు కనిపిస్తున్నాయి. ఏటా అధికారులు తేమ, తాలు శాతం ఎక్కువగా ఉందని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సహకార సంఘం అధికారులు రైతుల బాధలను గమనించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి.

- మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఘట్‌కేసర్

కోతల పనులు జోరందుకున్నాయి



వానాకాలం సీజన్‌కు సంబంధించి వరి కోతలు జోరందుకున్నాయి. రైతులు ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి మోసపోవద్దు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. ధాన్యంలో తేమ 17 శాతానికి మించకుండా చూసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో మట్టిపెడ్డలు, తాలు అధికంగా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- లావణ్య, వ్యవసాయ శాఖ అధికారి, ఘట్‌కేసర్

పత్తి కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


మారెపల్లి సమీపంలో సీసీఐ పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ అంజయ్య

పెద్దేముల్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పత్తికొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ అంజయ్య అన్నారు. పెద్దేముల్ మండలం మారెపల్లి సమీపంలోని పత్తిమిల్లులో సీసీఐ పత్తికొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సాయిని నారాయణరెడ్డి, నాయకులు కొమ్ముగోపాల్‌రెడ్డి, యువనాయకులు మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సాయిని శ్రీనివాస్‌రెడ్డి, బంధ్యప్ప, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష బిల్వార్చన

కొడంగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కొడంగల్‌లోని మహాదేవ శివాలయంలో సోమవారం (నేడు) లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పురోహితులు కోరారు. స్థానిక మహాదేవ శివాలయంలో లక్ష బిల్వార్చన, కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాచోటేశ్వర శివాచార్య మహా స్వామి హాజరుకానున్నట్లు తెలిపారు.

అక్రమంగా చెట్టు నరికివేత

● ఇంటి యజమాని ఫిర్యాదు


ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్‌లో నరికేసిన వేపచెట్టు

ఘట్‌కేసర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ఎదుట ఉన్న భారీ వేపచెట్టును అక్రమంగా నరికించారని ఇంటి యజమాని ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్‌లోని కరీంగూడ రోడ్డులోని తమ ఇంటి ఎదుట దాదాపు 30సంవత్సరాల వేపచెట్టును పక్కింటి వారు యంత్రంతో పూర్తిగా తొలగించారని అనిల్ అనే వ్యక్తి ఫారెస్టు అధికారులకు పిర్యాదు చేశాడు. కొమ్మకొడుతామని చెప్పి పూర్తిగా చెట్టునే తొలగించారని ఆయన తెలిపాడు. దీంతో ఫారెస్టు అధికారులు వచ్చి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. చెట్టును నరికించినా, నరికించినా వారిపై చర్యలు తీసుంటామని అధికారులు తెలిపారు. ఎలాంటి చెట్లను అయిన తొలగించడానికి ఫారెస్టు శాఖ అనుమతి పొందాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు వేశారు.. స్తంభాలు వదిలేశారు

కొడంగల్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడిరైచూర్ గ్రామ ఎస్సీకాలని సమీపంలో విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే రోడ్డువేశారు. స్తంభాలు ఉన్న చోటునే రోడ్డు మూలమలుపు ఉండడంతో ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి మరోచోట పాతాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ఎస్సీకాలనీలో రోడ్డు మధ్యలో స్తంభాలు

సీఎంను కలిసిన బుయ్యని బ్రదర్స్


సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆయన సోదరుడు

తాండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోదరుడు ఆర్బీవీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు బ్రిజేష్‌రెడ్డి వివాహం ఈనెల 8వ తేదీన జరగనుంది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, సోదరుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆహ్వానించారు.

నిరుపయోగంగా నీటి తొట్లు


కొడంగల్ శివారులోని బండల ఎల్లమ్మ దేవాలయం సమీపంలో..

కొడంగల్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు దాహార్తి తీర్చేందుకు మండల పరిధిలోని గ్రామాల్లో సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద, ప్రజా కుళాయిలు, ట్యాంకుల వద్ద నీటితొట్లు నిర్మించారు. కొన్నేళ్ల కిందట నీటితొట్లను నిర్మించగా తొలినాళ్లలో నిర్వహణబాగానే ఉన్నా ఆ తర్వాత వాటి నిర్వహణ పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో మూగజీవాల దాహార్తి తీరక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నీటి తొట్లు శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన నీటి తోట్లకు పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని నింపే విధంగా చర్యలు తీసుకోవాలని పాడిరైతులు కోరుతున్నారు.


చిట్లపల్లిలో రోడ్డు పక్కన శిథిలావస్థకు చేరిన నీటితొట్టె

పక్కాగా భూముల లెక్క

(ఐదో పేజీ తరువాయి)

భూముల సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. మలి విడతలో 25 జిల్లాలో 408 గ్రామాల్లో భూముల రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించగా, జిల్లాలో 14 మండలాల పరిధిలో 39 గ్రామాలను రీ సర్వే చేయాలని నిర్ణయించారు. బొంరాస్‌పేట్ మండలంలో నాజ్‌ఖాన్‌పల్లి, లింగంపల్లి, సాలిండాపూర్, కొడంగల్ మండలంలో పర్సాపూర్, అంగడి రాయచూర్, కోట్‌పల్లి మండలంలో ఇందోల్, మోత్కుపల్లి, బార్వాద్, కోట్‌పల్లి, మర్పల్లి మండలంలో వీర్లపల్లి, సిరిపురం, ఖల్కోడ, కుదుగుంట, మోమిన్‌పేట్ మండలంలో కాస్లాబాద్, గోవిందాపూర్, మోమిన్‌పేట్, మొరంగపల్లి, అమ్రాదికలాన్, దుర్గంచెరువు, నవాబ్‌పేట్ మండలంలో నవాబ్‌పేట్, పులుమామిడి, ఎకమామిడి, మీనపల్లి కలాన్, పూడూరు మండలంలో పోతిరెడ్డిగూడ, తుర్క ఎన్కెపల్లి, పెద్ద ఉమ్మెంతాల్, చీలాపూర్, పెద్దేముల్ మండలంలో జనగాం, గిర్మాపూర్, కందనెల్లి, వికారాబాద్ మండలంలో కొంపల్లి, పులుమద్ది, అత్తెల్లి, ధారూరు మండలంలో తరిగోపుల, దౌల్తాబాద్ మండలంలో ఈర్లపల్లి, బషీరాబాద్ మండలంలో నవాంద్గి, పరిగి మండలం, చిగురాల్‌పల్లి, యాలాల్ మండలంలో కోకట్ గ్రామాల్లో భూముల రీ సర్వే చేయనున్నారు.

ఆదేశాలు రాగానే సర్వే ప్రారంభిస్తాం

జిల్లాలో 38 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గతనెల 27వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశాం. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు రాగానే భూ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం

- ఎం.రాంరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రెవెన్యూ, వికారాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న అత్తర్ సింగ్

తాండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటాలని బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్, తెలంగాణ ఇన్‌చార్జి అత్తర్ సింగ్ పిలుపునిచ్చారు. తాండూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాలకు, అణిచి వేయబడిన జాతులకు సమన్యాయం జరగాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలన్నారు. రాబోయే తరాలు మరింత అట్టడుగు స్థాయికి చేరి వారికి బానిసలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతీ బహుజనుడు బీఎస్పీ ద్వారా చట్టసభలకు వెళ్లినప్పుడే పరిస్థితులు మారుతాయని అన్నారు. బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందితేనే మనుగడ సాధిస్తారని అన్నారు. బీసీలు బీఎస్పీలో చేరి రాజ్యాధికారం తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీఎస్పీ ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ ముదిరాజ్, ప్రభు, జాతీయ కోఆర్డినేటర్ సురేష్, తెలంగాణ కోఆర్డినేటర్ దయనంద్‌రావు, జిల్లా పార్టీ ఇంచార్జ్ అమీర్, జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ , జిల్లా అధ్యక్షులు నరేందర్ ముదిరాజ్, నాయకులు బాలరాజ్, పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడి జన్మదిన వేడుకలు

యాలాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. రాజేందర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.


రాజేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు